క్లుప్తంగా

ఎమ్మెల్యే వాహనం తనిఖీ



వెలిశాలలో ఎమ్మెల్యే కిషోర్ వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

తిరుమలగిరి : తిరుమలగిరి మండలం వెలిశాల క్రాస్ రోడ్డు చెక్ పోస్టు వద్ద తుంగతుర్తి శాసన సభ్యుడు గాదరి కిషోర్‌కుమార్ వాహనాన్ని శనివారం పోలీసులు తనిఖీ చేశారు. మండలంలోని మామిడాల ఎన్నికల ప్రచారానికి వెళ్తున్న ఎమ్మెల్యే కిషోర్ వాహనాన్ని చెక్ పోస్టు వద్ద క్షుణ్ణంగా సోదా చేశారు.

26న బహిరంగ సభ

భానుపురి : సూర్యాపేట పట్టణ సమీపంలోని కుడకుడ మద్రేసా బైతుల్ ఉలుమ్‌లో ఈ నెల 26న సాయంత్రం 6గంటలకు ఇస్లామిక్ బహిరంగ సభ (జల్సే సిరతుల్ నబీ స) నిర్వహించనున్నట్లు ప్రోగ్రాం కన్వీనర్ ఇమామ్ – ఖతిబ్ మస్జిద్ నూర్ హఫీజ్ ఖలీల్ అహ్మద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభను జమియతుల్ ఉలేమా జిల్లా సెక్రటరీ మౌలానా అతహర్ సహబ్ నిర్వహిస్తున్నారని తెలిపారు. ముఖ్య అతిథులుగా హజ్రత్ మౌలానా ఖారి అహ్మద్ ఫలాహి గుజరాత్, మౌలానా అర్షద్ ఖాస్మి హైదరాబాద్, ముఫ్తీ సిద్దిఖ్ అహ్మద్, మౌలానా అబ్దుల్ ఖాదర్ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ముస్లింలు ఈ సభకు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

ఆర్థికసాయం అందజేత



వెలుగుపల్లిలో బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న దాతలు

తుంగతుర్తి : మండల పరిధిలోని వెలుగుపల్లి గ్రామానికి చెందిన కమ్మరి సుజాత ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఈ సందర్భంగా ఆరాధ్య ఫౌండేషన్ చైర్మన్ తాడోజు శ్రీకాంత్ రాజ్ శనివారం మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.5,000 ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమలో ఆరాధ్య ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సద్దుల బతుకమ్మకు ఏర్పాట్లు



తిరుమలగిరిలో బతుకమ్మ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్ దండు శ్రీనివాస్

తిరుమలగిరి : సద్దుల బతుకమ్మ సందర్భంగా తిరుమలగిరి పరిధిలోని చెరువుల వద్ద బతుకమ్మ ఆట మైదానాలు ముస్తాబవుతున్నాయి. ఆయా ప్రాంతాల్లోని స్థలాల్లో మున్సిపల్ సిబ్బంది చెత్తా, చెదారం తొలగించి శుభ్రం చేశారు. స్థలాల వద్ద ప్రత్యేకంగా ఫ్లడ్ లైట్లను ఏర్పాటు చేశారు. స్థలాలను మున్సిపల్ కమిషనర్ దండు శ్రీనివాస్ శనివారం పరిశీలించారు.

బీఎస్పీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా శ్రావణ్‌కుమార్

నాగారం: బహుజన సమాజ్ పార్టీ తుంగతుర్తి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా ఫణిగిరి గ్రామానికి చెందిన దాసరి శ్రావణ్‌కుమార్ శనివారం నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తుంగతుర్తి నియోజకవర్గంలో బీఎస్పీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి స్పెషల్ ఇన్‌చార్జ్ దయాకర్, రాష్ట్ర కార్యదర్శి బొడ్డు కిరణ్, నియోజకవర్గ అధ్యక్షుడు మల్లేపాక వెంకటేష్, కె. నవీన్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా చెరుకు సతీష్

చివ్వెంల : ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా చివ్వెంల మండల పరిధిలోని దురాజ్‌పల్లి గ్రామానికి చెందిన చెరుకు సతీష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం సూర్యాపేట పట్టణంలో నిర్వహించిన ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఈ ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జ్ తురుగంటి అంజయ్య నియమాకపత్రాన్ని అందజేశారు.

కొనుగోలులో కొత్త విధానం

- అక్రమాలను అరికట్టేందుకు బయోమెట్రిక్

తిరుమలగిరి : ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద అక్రమాలను నిరోధించేందుకు ప్రభుత్వం కొత్త నిర్ణయం తీసుకుంది. ఈ వానాకాలం సీజన్ నుంచి కొనుగోలు కేంద్రాల వద్ద బయోమెట్రిక్ విధానం అమలు చేయనుంది. ఈ విధానంతో రైతులకు ప్రయోజనం కలుగుతుందని అధికారులు అంటున్నారు. తుంగతుర్తి నియోజకవర్గంలో ఈ నెల 17వ తేదీ నుంచి కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నారు. దసరా తరువాత ఈ కేంద్రాల్లో కొనుగోళ్లు వేగవంతంగా జరుగనున్నాయి.

50వేల ఎకరాలకు పైగా సాగు..

ఈ వానా కాలం సీజన్‌లో తుంగతుర్తి నియోజకవర్గంలో 50 వేల ఎకరాలకు పైగా వరి సాగయింది. ప్రస్తుతం కోతలు ప్రారంభమయ్యాయి. దీంతో పంట కొనుగోళ్లకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ కొనుగోలు కేంద్రాల వద్ద బయోమెట్రిక్ విధానం అమలు చేయనున్నారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకొచ్చిన ధాన్యంలో తేమ శాతం 17లోపు వచ్చిన తరువాత గన్నీ సంచుల్లోకి నింపి తూకం వేస్తారు. తూకం పూర్తయిన తరువాత ఈపాస్ మిషన్ ద్వారా రైతు వేలి ముద్రలను తీసుకొని ధాన్యం వివరాలను నమోదు చేస్తారు. ఆ వివరాలు జిల్లా పౌర సరఫరాల అధికారులకు వెళ్తాయి. ఈ బయోమెట్రిక్ విధానం ద్వారా ధాన్యం కొనుగోళ్లలో మధ్య దళారులతో పాటు బోగస్ రైతులను అరికట్టవచ్చని అధికారులు భావిస్తున్నారు.



ధాన్యం బస్తాలు నింపుతున్న హమాలీలు (ఫైల్)

కొనుగోళ్లలో అక్రమాలు అరికట్టవచ్చు



గతంలో మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో భారీ ఎత్తున అక్రమాలు జరిగాయి. ప్రభుత్వం ఈ బయోమెట్రిక్ విధానం అమలు చేయడం మంచి విషయం. దీనివల్ల కొనుగోలు కేంద్రాల్లో అక్రమాలను అరికట్టవచ్చు. రైతులకు ఎంతో మేలు జరుగుతుంది.

- కడెం లింగయ్య, సీపీఎం నాయకుడు

కాంగ్రెస్ హామీలను ప్రజలు విశ్వసించరు

- ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్

తిరుమలగిరి : దశాబ్దాలుగా తెలంగాణను విస్మరించిన కాంగ్రెస్ పాలకులు ప్రస్తుత ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ఇచ్చిన హామీలను ప్రజలు విశ్వసించరని తుంగతుర్తి శాసన సభ్యుడు గాదరి కిషోర్‌కుమార్ అన్నారు. శనివారం జలాల్‌పురంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం మామిడాల, భోక్యానాయక్ తండా, చింతలకుంట తండాలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలనే కాకుండా మేనిఫెస్టోలో లేని హామీలను కూడా అమలు చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సంకెపల్లి రఘునందన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కొమ్మినేని స్రవంతిసతీష్‌కుమార్, ఎంపీపీ నెమురుగొమ్ముల స్నేహలత, జెడ్పీటీసీ దూపటి అంజలిరవీందర్, తిరుమని యాదగిరి, సర్పంచ్‌లు కరుణాకర్, రవీందర్, వైస్ ఎంపీపీ బొడ్డు సుజాత, ఎంపీటీసీ సభ్యులు పొన్నం సమత వెంకన్న, యాకూబ్‌నాయక్, నరోత్తమ్‌రెడ్డి, శాత వాహనరావు, బత్తుల శ్రీను పాల్గొన్నారు.



మామిడాలలో ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌ను గజమాలతో సన్మానిస్తున్న అభిమానులు

కాంగ్రెస్‌తోనే పేదల అభ్యున్నతి



తిరుమలగిరి : ఎన్ఎస్‌యూఐ ర్యాలీలో పాల్గొన్న కిరణ్‌కుమార్‌రెడ్డి, తదితరులు



అర్వపల్లి : కొమ్మాలలో కాంగ్రెస్‌లో చేరిన వారితో డీసీసీ ఉపాధ్యక్షుడు, తదితరులు

తిరుమలగిరి : మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీ పేదల పక్షపాతి అని, కాంగ్రెస్‌తోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమని టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. తిరుమలగిరిలో శనివారం ఎన్ఎస్‌యూఐ నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ పాలనపై ప్రజలు విసుగుచెందారని అన్నారు. ప్రస్తుతం ప్రజలు ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్ వైపు చూస్తున్నారని తెలిపారు. తెలంగాణ ఇచ్చిన తల్లి సోనియమ్మకు ప్రజలంతా రుణపడి ఉండాలని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ విజయానికి ఎన్ఎస్‌యూఐ నాయకులు కృషి చేయాలని అన్నారు. ఈ సందర్భంగా స్థానిక తెలంగాణ చౌరస్తా నుంచి ఎస్ఎస్ ఫంక్షన్ హాల్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు కందుకూరి అంబేద్కర్, నాయకులు యుగేందర్, జుమ్మిలాల్, సృజన్, హఫీజ్, సర్దార్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : కాంగ్రెస్ గెలుపు కోసం ప్రతి కార్యకర్త కృషిచేయాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి అన్నారు. మండల పరిధిలోని కొమ్మాల గ్రామానికి చెందిన గంగదెరి చెన్నయ్య, గంగదెరి సైదులు, పరశురాములు, సుధాకర్, గోవర్ధన్, బోడ విజయ్‌తో పాటు కొంత మంది శనివారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో బ్లాక్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, మోరపాక సత్యం, ఉపాధ్యక్షుడు నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, మందడి పూర్ణచంద్రారెడ్డి, కుంటిగొర్ల శ్రీను, బాషపోలు శ్రీను, సూరారపు సుదర్శన్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి

నూతనకల్ : వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పని చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని ఆయన అన్నారు. వచ్చే ఎన్నికల్లో పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పసుల అశోక్ యాదవ్, బంటు బద్రి, మేడిపల్లి అశోక్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో వర్గపోరు

తుంగతుర్తి : మండల పరిధిలోని అన్నారం గ్రామంలో బీఆర్ఎస్ పార్టీలో వర్గపోరు బయటపడింది. శనివారం అన్నారంలో బీఆర్ఎస్ పార్టీ బూత్‌స్థాయి కమిటీ సమావేశంలో నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ దొంగరి శ్రీనివాస్‌లు గ్రామంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్‌లోని ఒక వర్గం నుంచి తీవ్ర నిరసన ఎదురైంది. మొదటి నుంచి పార్టీ కోసం కష్టపడిన వారికి ప్రాధాన్యం ఇవ్వకుండా మధ్యలో వచ్చిన వారు ఎలా సమావేశాలు నిర్వహిస్తారని అన్నారు. గ్రామంలో బూత్‌స్థాయి సమావేశం నిర్వహించవద్దని వాదించారు. ఈ క్రమంలో కార్యకర్తలు ఘర్షణపడ్డారు. దీంతో బూత్‌స్థాయి సమావేశం నిర్వహించకుండానే వారు వెనుదిరిగారు. ఇదే తరహాలో మండలంలోని వివిధ గ్రామాల్లో సైతం బీఆర్ఎస్‌లో వర్గపోరు ఉంది.

బీఆర్ఎస్‌తోనే ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు

అర్వపల్లి : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం జలాలు రావడంతో పాటు ప్రతి ఇంటికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరాయని బీఆర్ఎస్‌వీ మండల ప్రధాన కార్యదర్శి ఉయ్యాల రాముగౌడ్ అన్నారు. ఎమ్మెల్యేగా కిషోర్ మూడోసారి గెలుపొందాలని కోరుతూ శనివారం కాసర్లపహాడ్ గ్రామంలోని ఆలయాల్లో పూజలు జరిపిన అనంతరం మాట్లాడారు. నియోజకవర్గంలో గత 60 ఏళ్లుగా జరగని అభివృద్ధి తొమ్మిదిన్నరేళ్లలో సాధ్యమైందన్నారు. ఎమ్మెల్యేగా గాదరి కిషోర్‌కు హ్యాట్రిక్ విజయం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

తుంగతుర్తి : వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తుంగతుర్తి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ మూడోసారి భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పులుసు యాదగిరి అన్నారు. శనివారం మండల పరిధిలోని దేవునిగుట్టతండాలో నిర్వహించిన బీఆర్ఎస్ బూత్‌స్థాయి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. తుంగతుర్తి నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్‌దే అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరాయని తెలిపారు. ఈ నెల 29న తిరుమలగిరిలో జరిగే సీఎం కేసీఆర్ బహిరంగ సభకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఈరోజీ, భాస్కర్, భిక్షం, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



దేవునిగుట్టతండాలో మాట్లాడుతున్న మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పులుసు యాదగిరి

తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రానికి చేరిన ఈవీఎంలు

తుంగతుర్తి : నవంబర్ 30న జరిగే అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఈవీఎంలు తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రానికి చేరాయి. అధికారులు నియోజకవర్గంలోని 9 మండలాల్లో 326 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 326 ఈవీఎంలతో పాటు అదనంగా మరో 20శాతం ఈవీఎంలు తుంగతుర్తికి చేరుకున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు తెలిపారు. ఈవీఎంలతో పాటు ఎన్నికల సామగ్రిని తుంగతుర్తిలోని వ్యవసాయ మార్కెట్ గోదాంలో భద్రపరిచినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా రాజకీయ పార్టీలు సహకరించాలన్నారు. అనంతరం వివిధ పార్టీల రాజకీయ నాయకుల సమక్షంలో అధికారులు ఈవీఎంలు, ఎన్నికల సామగ్రిని స్ట్రాంగ్‌రూంలో భద్రపరిచారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, తహసీల్దార్ యాదగిరిరెడ్డి, డీటీ హరిశ్చంద్రప్రసాద్, ఎన్నికల స్ట్రాంగ్ రూం సిబ్బంది, పోలీసు సిబ్బంది, వివిధ పార్టీల రాజకీయ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఈవీఎంలను స్ట్రాంగ్‌రూంలో భద్రపరుస్తున్న అధికారులు, పోలీస్ సిబ్బంది

గ్రామ పంచాయతీ సిబ్బందికి దుస్తుల పంపిణీ



మద్దిరాలలో గ్రామ పంచాయతీ సిబ్బందికి దుస్తులను పంపిణీ చేస్తున్న ఎస్ఏ.రజాక్

మద్దిరాల : సద్దుల బత్తుకమ్మ, దసరా పండుగను పురస్కరించుకొని మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ సిబ్బందికి సర్పంచ్ షేక్ ఇంతియాజ్ ఖాతూన్ రజాక్ శనివారం దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు బంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఎస్ఏ.రజాక్ పాల్గొని వారికి దుస్తులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గూడ వెంకట్‌రెడ్డి, వద్దాణం మధుసూదన్, మల్యాల నర్సయ్య, యల్లు శివారెడ్డి, చామకూరి సోమయ్య, భిక్షం, శేరి మోహన్‌రెడ్డి, ఏలేటి లింగారెడ్డి, వల్లపు రమేష్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం



తిమ్మాపురం జెడ్పీహెచ్ఎస్‌లో జరిగిన సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

అర్వపల్లి : తిమ్మాపురం జెడ్పీహెచ్ఎస్‌లో 2004–2005 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు శనివారం ఆత్మీయ సమ్మేళనాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. పూర్వవిద్యార్థులైన కౌసర్‌బేగం, మాండ్ర లింగయ్యలకు రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు సందీప్‌రెడ్డి, రాంబాబు, గోవర్ధన్, సతీష్, విష్ణు, లింగయ్య, రమేష్, సతీష్, నాగరాజు, శ్రీను, నరేష్, పూర్ణచందర్, బూర్గుల భాగ్య, ఉషశ్రీ, పర్వీన్‌బేగం, వసంత, సరిత, మాధవి, గణిత, అంజమ్మ, నాగమ్మ, జ్యోతి, శైలజ, నిర్మల, ధనమ్మ, విజయ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దుర్గామాత శరన్నవరాత్రోత్సవాలు



పెన్‌పహాడ్ : నారాయణగూడెంలో ప్రత్యేక పూజలు చేస్తున్న మంత్రి సతీమణి సునీత



చివ్వెంల : బి.చందుపట్లలో అమ్మవారికి కుంకుమ పూజ నిర్వహిస్తున్న మహిళలు



భానుపురి : అన్నదానం చేస్తున్న కమిటీ సభ్యులు

భానుపురి : పట్టణవ్యాప్తంగా దుర్గామాత ఉత్సవాలు శనివారం కొనసాగాయి. పట్టణంలోని 20వ వార్డులో సేవాయూత్ ఆధ్వర్యంలో 12వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో శ్రీహర్ష, సోమగాని లక్ష్మణ్‌నాయుడు, దేవేందర్‌రెడ్డి, పగిళ్ల నాగరాజు, కిరణ్, అనిల్, శివ, సంతోష్, దేవుడు, వంశీ తదితరులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : దుర్గాదేవి ఉత్సవాల్లో భాగంగా మండలపరిధిలోని అనాజిపురం, నాగులపహాడ్, నారాయణగూడెం గ్రామాల్లో మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి సతీమణి గుంటకండ్ల సునీత శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నాతాల జానకిరాంరెడ్డి, సర్పంచ్‌లు చెన్ను శ్రీనివాస్‌రెడ్డి, రాయిలి లక్ష్మి, మండలి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

చివ్వెంల : మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని గ్రామాల్లో శనివారం దేవీ నవరాత్రోత్సవాల్లో కొనసాగాయి. ఈ సందర్భంగా బి.చందుపట్ల గ్రామంలో కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమలో ఎంపీపీ ధరావతు కుమారి బాబు నాయక్, వైస్ ఎంపీపీ జూలకంటి జీవన్ రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : అర్వపల్లిలో కొమురంభీం యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దుర్గామాత విగ్రహం వద్ద శనివారం ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్ పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

అన్ని దానాల్లోకెల్లా అన్నదానం గొప్పది

నాగారం : అన్ని దానాల్లోకెల్లా అన్నదానం గొప్పదని సర్పంచ్ పసుపులేటి ప్రేమలతవెంకట్‌రెడ్డి అన్నారు. మాచిరెడ్డిపల్లి గ్రామంలో ప్రతిష్ఠించిన దుర్గామాత విగ్రహం వద్ద శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లిలో 1000 మందికి అన్నదానం

అర్వపల్లి : అర్వపల్లిలో కొమురంభీం యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహం వద్ద దాతలు శనివారం అన్నదానం చేశారు. కార్యక్రమంలో దాతలు మనుబోతుల గణేష్, అంకిరెడ్డి ప్రసాద్, బొడ్రబోయిన సోమశేఖర్, కొమ్ము గణేష్, జోర్క వినోద్, కొమురంభీం యూత్‌సభ్యులు పాల్గొన్నారు.



మద్దిరాల : కుక్కడంలో దుర్గామాత విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

లలిత త్రిపుర సుందరీ దేవిగా దుర్గామాత

మద్దిరాల : మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో దుర్గామాత నవరాత్రోత్సవాలు కొనసాగుతున్నాయి. శనివారం దుర్గామాత లలిత త్రిపుర సుందరీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చింది. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



అర్వపల్లిలో దుర్గామాత మండపం వద్ద పూజలు చేస్తున్న ఎంపీపీ మన్నె రేణుక



నాగారం : మాచిరెడ్డిపల్లిలో అన్నదానం చేస్తున్న సర్పంచ్ పసుపులేటి ప్రేమలతవెంకట్‌రెడ్డి



అర్వపల్లిలో అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

నాణ్యమైన ధాన్యంతో రైతులకు మద్దతు ధర

నాగారం : రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకొచ్చి ప్రభుత్వం అందించే మద్దతు ధర పొందాలని పీఏసీఎస్ సీఈఓ విజయ్‌కృష్ణారెడ్డి అన్నారు. శనివారం ఈటూరులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం ఏ–గ్రేడ్ ధాన్యానికి రూ.2,203, బీ–గ్రేడ్ ధాన్యానికి రూ.2,183ల చొప్పున మద్దతు ధర చెల్లిస్తుందన్నారు. రైతులు 17శాతంలోపు తేమ ఉన్న ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మహేష్, నాగార్జున, రవీందర్, సాలయ్య, రైతులు పాల్గొన్నారు.

అర్వపల్లి : రైతుల సంక్షేమమే సహకార సంఘాల ధ్యేయమని జాజిరెడ్డిగూడెం ఉమ్మడి మండల పీఏసీఎస్ సీఈఓ మేడెబోయిన రామస్వామి అన్నారు. శనివారం జాజిరెడ్డిగూడెం పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొమ్మాల, రామన్నగూడెం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. 17శాతం లోపు తేమ ఉండేలా చూసుకొని ధాన్యాన్ని తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఓ ఆర్. శశిధర్‌రెడ్డి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ అశోక్‌కుమార్, ఏఈఓ శోభారాణి, రైతులు జెట్టి సుదర్శన్, దోరేపల్లి వెంకటయ్య, అంజయ్య, పీఏసీఎస్ సిబ్బంది శ్రీకాంత్, మహేందర్, శ్రీను, సైదులు పాల్గొన్నారు.



నాగారం : ఈటూరులో పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఈఓ విజయ్‌కృష్ణారెడ్డి



అర్వపల్లి : రామన్నగూడెంలో పీఏసీఎస్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం



సంతోష్‌బాబు విగ్రహానికి నివాళులర్పిస్తున్న అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు, తదితరులు



నాగారంలో నివాళులర్పిస్తున్న సిబ్బంది

సూర్యాపేట క్రైం : పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలోని పీఎస్ఆర్ సెంటర్ నుంచి సంతోష్‌బాబు చౌరస్తా వరకు పోలీసులు శాంతి ర్యాలీ నిర్వహించారు. అమరవీరుడు కల్నల్ సంతోష్‌బాబు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు మాట్లాడారు. పోలీస్ సిబ్బంది, ఆర్మీ జవాన్లు, కేంద్ర బలగాలు 24గంటలు విధులు నిర్వహిస్తూ దేశాన్ని, రాష్ట్రాలను కాపాడుతున్నారని అన్నారు. సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణకు అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల : పోలీస్ అమరుల సంస్మరణ దినోత్సవాన్ని మండల కేంద్రంలో ఎస్ఐ రవీందర్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. విధి నిర్వహణలో ప్రాణాలను వదిలిన పోలీసు అమర వీరులకు సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాగారం : మండల కేంద్రంలో పోలీసుల అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని పోలీసు శాఖ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది సూర్యాపేట–జనగామ జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. పోలీస్ అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం ఎస్ఐ సైదులుగౌడ్ మాట్లాడారు. పోలీస్ అమర వీరుల త్యాగాలు, వారి సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది వెంకన్న, చైతన్య, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

పండుగ సందడి

సూర్యాపేట/తిరుమలగిరి : సద్దుల బతుకమ్మ, దసరా నేపథ్యంలో గ్రామ గ్రామాన సందడి నెలకొంది. సూర్యాపేట, తిరుమలగిరి మున్సిపాలిటీ కేంద్రాల్లోని దుకాణాలన్నీ శనివారం కిక్కిరిసి కనిపించాయి. దూర ప్రాంతాల నుంచి సొంత గ్రామాలకు వస్తున్న వారితో రద్దీ నెలకొంది. కిరాణం సరుకులు, పండుగ సామగ్రి, దుస్తుల కొనుగోలు కోసం గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున వస్తున్నారు. బతుకమ్మ వేడుకలకు పూల కొనుగోళ్లు జోరందుకున్నాయి.



సూర్యాపేటలో పూలు కొంటున్న మహిళలు



సూర్యాపేట కొత్త బస్టాండ్‌లో రద్దీ..



సూర్యాపేటలోని ఓ వస్త్ర దుకాణంలో..



సూర్యాపేటలోని పూల సెంటర్‌లో రద్దీ..



తిరుమలగిరిలోని ఓ షాపులో దుస్తులు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు